మహా బడ్జెట్ రూ.4761 కోట్లు...

జీవీఎంసీ 2025-26 ప్రత్యేక బడ్జెట్ ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: అంచనా లకు మించి భారీ అంకెల గారిడితో మహా బడ్జెట్ ను ఎట్టకేలకు ఆర్థిక సంవత్సరం మరో రెండు రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో శనివారం జీవీఎంసీ పాలకవర్గం ఆమోదించింది. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన బడ్జెట్ సమా వేశం జరిగింది. ఈ వార్షిక బడ్జెట్ కు జీవీఎంసీ స్థాయి సంఘం ఆమోద ముద్ర డిసెంబ ర్ వేసింది. ఓ చిన్న రాష్ట్రానికి సరిపడేలా 25 లక్షలు జనాభా కలిగిన జీవీఎంసీ బడ్జెట్ రూ.4761 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. 2025-26 వార్షిక బడ్జెట్ ప్రారంభపు నిల్వ రూ.482.26 కోట్లు, అన్ని పద్దుల కింద జమలు రూ.427.96 కోట్లు, ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.476.18 కోట్లు, అన్ని పద్దుల కిం ద ఖర్చులు రూ.460.14 కోట్లు. ముగింపు నిల్వగా రూ.16.04 కోట్లుగా చూపారు. విద్యకు కేటాయింపులు తగ్గించారని సిపిఐ ఫ్లోర్ లీడర్ ఏ జే స్టాలిన్ మండిపడ్డారు. ఎస్సీ ఎస్టీలకు కేటాయించిన నిధుల్లో ఖర్చు చేయడం లేదని కేవలం బడ్జెట్లో కేటాయింపులకు మాత్రమే నోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 750 కి పైగా మురికివాడలో ఉన్నాయని వాటిని అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అంకెల గారడీతో వాస్తవాలకు దగ్గరలో బడ్జెట్ రూపకల్పన చేయాలని అందులో కార్పొరేటర్లు అందర్నీ భాగస్వామ్యం చేయాలని కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధులు తెప్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి జీవీఎంసీకి రావాల్సిన నిధులు వెంటనే వచ్చేలా కూటమి ప్రభుత్వం కార్పొరేటర్లు కృషిచేయాలని కోరారు. సిపిఎం ఫ్లోర్ లీడర్ గంగారావు మాట్లాడుతూ జీవీఎంసీ ఆదాయం, ఖర్చు 1500 కోట్లు దాటకపోయినా 5000 కోట్లు బడ్జెట్ చూపడం విశాఖ ప్రజలను మోసం చేయడమేనని మండిపడ్డారు. భారీ అంచనాలతో నాలుగు రెట్లు బడ్జెట్ చూపడం సరికాదన్నారు. గత బడ్జెట్లో 250 కోట్లు ఎస్సీ ఎస్టీలకు కేటాయిస్తే కేవలం 20 కోట్లు ఖర్చు చేశారని గుర్తు చేశారు. తొలిత టిడిపి సభ్యులంతా బడ్జెట్ సమావేశం ఆలస్యంపై మేయర్ ను నిలదీశారు.

ఈ సమావేశానికి వైసీపీ కార్పొరేటర్లు హాజరు కాకపోవడంతో కూటమి కార్పొరేటర్లు జీవీఎంసీ బడ్జెట్ పై వైసీపీకి చిత్తశుద్ధి లేదని ప్రశ్నించారు. మేయర్ వెంకట కుమారి తో పాటు డిప్యూటీ మేయర్లు శ్రీధర్, సతీష్, ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తం శెట్టి ప్రియాంక, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, వైసీపీ నుండి హాజరయ్యారు. సభ్యులకు 25 వేలు చొప్పున గిఫ్ట్ కూపన్స్ రూపంలో దాదాపు 48 లక్షలు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

16, 17, 19 తేదీలో అవిశ్వాసం?

ఇదిలా ఉండగా మేయర్ పీఠం దక్కించుకునేందుకు కూటమి నేతలు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. నేరుగా కలెక్టర్, జీవీఎంసీ ఇన్చార్జ్ కమిషనర్ డాక్టర్ఎంఎన్ హరేందిర ప్రసాద్ కు వారం రోజుల క్రితం అవిశ్వాసం కోరుతూ వినతి పత్రం అందజేశారు. వచ్చే నెల 16, 17, 19 తేదీల్లో అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉన్నట్టు సమాచారం. యాదవ సామాజిక వర్గానికి చెందిన మేయర్ హరి వెంకటకుమారిపై అవిశ్వాసానికి కూటమి నేతలు ప్రయత్నిస్తుండడంతో యాదవ కార్పొరేటర్లలో లుకలుకలు ప్రారంభమయ్యాయి. యాదవ కులానికి చెందిన మేయర్ ను కాదని ఇంకెవరికైనా మేయర్ పదవి ఇస్తే ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని స్పష్టం చేస్తున్నారు.

తెలుగువారి గుండె చప్పుడు తెలుగుదేశం...

- పార్లమెంటులో ప్రతిపక్ష పాత్ర పోషించిన ప్రాంతీయ పార్టీగా చరిత్ర
- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పుట్టిన తెలుగుదేశం పార్టీ తెలుగు వారి గుండె చప్పుడుగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభివర్ణించారు. 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం రాంనగర్ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్థాపించిన 9 నెలల్లోనే వందేళ్ల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపించిన తెలుగుదేశానికి కార్యకర్తలే వెన్నెముకగా పేర్కొన్నారు. శుభ సూచకంగా భావించే పసుపును పార్టీ రంగుగా మార్చి, కార్మిక, కర్షక, పేద ప్రజలను ప్రతిబింబిస్తూ పార్టీ జెండాలో చక్రం, నాగలి, గుడిసె బొమ్మలను ఎన్టీఆర్ స్వయంగా తయారు చేసుకున్నారని వివరించారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, 2 రూపాయలకు కిలో బియ్యం, పక్కా ఇళ్లు వంటి సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి పార్టీని ప్రజలకు చేరువ చేశారని ఎన్టీఆర్ ను గుర్తు చేసుకున్నారు. 1984లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ మరణించిన తర్వాత జరిగిన ఎన్నికల్లో 30 సీట్లతో పార్లమెంటులో ప్రతిపక్ష పాత్ర పోషించిన ప్రాంతీయ పార్టీగా చరిత్ర సృష్టించిన తెలుగుదేశం పార్టీ జాతీయ రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆశయాలను, సిద్ధాంతాలను కొనసాగించడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ తెలుగుదేశాన్ని మరింత బలోపేతం చేస్తున్నారన్నారు. సంక్షేమ నిధితో కార్యకర్తల్లో ఆత్మస్థైర్యాన్ని నింపిన మంత్రి లోకేష్ చొరవతో కోటికి పైగా సభ్యత్వాల రికార్డు సాధ్యపడిందని చెప్పారు. లక్షకు పైగా సభ్యత్వాలతో భీమిలి ఉత్తరాంధ్రలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అంతకుముందు ఎంపీ ఎం. శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబులతో కలిసి కార్యాలయం ఆవరణలో జెండా ఎగురవేశారు. అనంతరం కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ కార్యకర్తలు, నాయకులకు శాలువా కప్పి పూలమాలలతో సన్మానం చేశారు. పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పొలరమరశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్యను దూరం చేయవద్దు

77, 107, 108 జువోలను రద్దు చేయాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ

విశాలాంధ్ర-విశాఖ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. శనివారం అల్లిపురం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలో భాగంగా పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే పద్ధతుల్లో జీవో నెంబర్ 77 తీసుకువచ్చిందని విమర్శించారు. కేవలం ప్రభుత్వ విద్యాసంస్థల్లో పీజీ చదివే వారికి మాత్రమే ఫీజు రీయింబర్స్ మెంట్ వర్తిస్తుందని, ప్రైవేటు విద్యాసంస్థల్లో పీజీ చేసే విద్యార్థులకు వర్తించదని జీవో నెంబర్ 77 తీసుకువచ్చారన్నారు. తక్షణమే జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులతో యూనివర్సిటీలు కిటకిటలాడుతున్న పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తీసుకోవడం వల్ల యూనివర్సిటీల్లో విద్యార్థులు లేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. యూనివర్సిటీలను బాగుపరచాలంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కామన్ ఎంట్రెన్స్ ప్రవేశ పరీక్షను రద్దుచేయాలని, యూనివర్సిటీలు విడిగా ప్రవేశ పరీక్షను నిర్వహించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గత నెల రోజులుగా వెటర్నరీ వైద్య విద్యార్థుల స్టైఫండ్ రూ.7 వేల నుంచి రూ.23 వేలకు పెంచాలని ఉద్యమాలు చేస్తున్నారని తక్షణమే వారి సమస్యలు పరిష్కరించి స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న సమయంలో వైద్య విద్యను పేదలకు దూరం చేసే విధంగా జీవో నెంబర్లు 107, 108 తీసుకువచ్చి వైద్య విద్యను కోట్ల రూపాయలకు అమ్ముతుండడంతో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ జీవోలను రద్దు చేసి ప్రతి పేద విద్యార్థికీ వైద్య విద్యను అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తక్షణమే ఈ జీవోలు..107, 108 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల్లో రూ.788 కోట్లు విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. రూ. 3580 కోట్లు విడుదల చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు. నాగరాజు, అధ్యక్షుడు పి.శేఖర్, సహాయ కార్యదర్శి హేమానంద్, ఉపాధ్యక్షులు కిరణ్, అభిషేక్ నాయకులు అభి, సూర్య పాల్గొన్నారు.

స్కూలు పిల్లల ఆటోలపై పెడుతున్న కేసులు వెంటనే ఆపాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-విశాఖ సిటీ : విశాఖలో స్కూలు పిల్లల ఆటోలపై పోలీసు వారు పెడుతున్న కేసులు ఎఫ్ఐఆర్ వేసి కోర్టులో డ్రైవర్లను కోర్టులో హాజరపరిచే డ్రైవర్లకు జీవన ఉపాధి లేకుండా చేయొద్దని అధికారులు కోరారు. ఆటో డ్రైవర్ల పై పోలీసు రవాణాశాఖ అధికారులు పోటీపడి పెడుతున్న కేసులను వెంటనే ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తేదీ 29 3 2025 ఉదయం 9 గంటలకి జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గర మండుట ఎండని లెక్కచేయకుండా వందలాది మంది ఆటో డ్రైవర్లు నిరసన ధర్నా చేశారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామన మూర్తి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలోకొస్తే ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర 15 వేల రూపాయలు ఇస్తామని జరిమానాలు పెంచే జీవో నెంబర్ 21 31 రద్దు చేస్తామని డ్రైవర్లకు వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ 10 లక్షలు అమలు చేస్తామని హామీ ఇచ్చి తొమ్మిది నెలలు గడిచిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని మండిపడ్డారు విశాఖ పోలీస్ కమిషనర్ ఓవర్ లోడ్ చేస్తున్న స్కూల్ పిల్లల ఆటో డ్రైవర్ల పై కేసులు పెట్టి ఎఫ్ఐఆర్ లేసి డ్రైవర్లను కోర్టులో పెట్టాలన్న ఆదేశాలను పున్నారా పరిశీలించాలని కోరారు ఇప్పటికే పెరిగిన డీజిల్ పెట్రోలు వంట గ్యాస్ నిత్యవసర వస్తువులు ధరలతో రోజంతా ఆటో నడిపిన పూటకడవని ఆటో డ్రైవర్లకు పోటీగా ఓలా ఉబర్ రాపిడి వాహనాలు వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్లు ఆదాయం కోల్పోయి ఇల్లు అద్దెలు కరెంట్ బిల్లులు చెల్లించలేక కనీసం పిల్లలకు కడుపునిండా అన్నం కూడా పెట్టలేని పరిస్థితిలో ఉన్న స్కూల్ పిల్లల ఆటో డ్రైవర్ల పై పోలీసులు రవాణా శాఖ అధికారులు పోటీపడి నిబంధనలు పేరుతో కేసులు పెట్టి వేల రూపాయలు జరిమానాలు ఇస్తే డ్రైవర్ ఎలాగా బ్రతకాలో చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు స్కూల్ ఆటోలో పదో తరగతి విద్యార్థిని 10 మందిని ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎనిమిది మంది ఆటో తిప్పెందుకు అనుమతి ఇవ్వాలని స్కూల్ పిల్లలు ఆటో డ్రైవర్ కి ఇస్తున్న జీతాలు పెంచి డ్రైవర్ల జీవనోపాధికి రక్షణ కల్పించాలని అధికారులు కోరారు ఆటో డ్రైవర్ల పై ఎఫ్ఐఆర్ లేసి కోర్టులో పెడితే ఆదాయం కోల్పోయి ఆటో డ్రైవర్ల మానసిక ఆందోళన గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు ఎవరైనా ఆటో ఓవర్ లోడ్ చేస్తే పోలీసు వారు ఫైన్ వేసి ఆటోలు విడుదల చేయాలని కోరారు ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గారు ఎన్నికల్లో ఆటో డ్రైవర్ కి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని వాహన మిత్ర 15000 రూపాయలు ఇవ్వాలని జీవో నెంబర్ 21 31 రద్దు చేయాలని ఆటోలు నగర పర్మిట్లు వెంటనే ఇవ్వాలని నగరంలో ఆటోలు వ్యానులు కు స్టాండ్ లో పార్కింగ్ స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రైవేటు సంస్థలకు ఇచ్చిన యాప్ ఓలా ఊబర్ రాపిడి నగర పరిధిలో నిషేధించి డ్రైవర్లకు జీవన ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు ఆటో డ్రైవర్ల అండ్ మోటార్ వాహన కార్మికుల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యేలు మంత్రులు ఆటో నగర పోలీస్ కమిషనర్ రోడ్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ గారు కలెక్టర్ గారితో జాయింట్ మీటింగ్ వేసి ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికులపై పోలీస్ రవాణా శాఖ అధికారులు పెడుతున్న కేసులను ఆపి డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని కోరారు లేనిపక్షంలో ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కే రెహమాన్ అద్దూరి శంకర్. వెంకట్.కృష్ణం నాయుడు అశోక్. రాజు యు శివాజీ దేవుడు ఈశ్వర్ చంటి నాని వేణు వందలాది మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆనందపురంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-అనందపురం: ఆనందపురం మండలంలో పలుచోట్ల తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవము ఘనంగా నిర్వహించారు .ఆనందపురం కూడలి వేములవలస మహాత్మా గాంధీ పూల మార్కెట్ సమీపంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ కోరాడ రాజబాబు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి పార్టీ ఆవిర్భావ దినోత్సవ నిర్వహించారు అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనాథ్ నారాయణరావు, సత్య వరప్రసాద్ బి అప్పారావు, కే సత్యమూర్తి రెడ్డి బాబు,రాము, శివ, అది నారాయణ, సంతోష్ ,రాము,తదితరులు పాల్గొన్నారు.

నూకాంభికా అమ్మవారి దర్శించుకున్న డిప్యూటీ మేయర్ దంపతులు

విశాలాంధ్ర-గోపాలపట్నం: కొత్త అమావాస్య పురస్కరించుకుని నగరంలో ప్రజలంతా ఉత్తరాంధ్ర జనుల ఆరాధ్య దైవం శ్రీ నూకాంభికా అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించారు.ఈ సందర్భంగా విశాఖ పశ్చిమ నియోజకవర్గం గోపాల పట్నం శ్రీ నూకాంభిక అమ్మవారిని నగర డిప్యుటీ మేయర్ శ్రీధర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటి సభ్యులు శ్రీధర్ కు అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.అనంతరం ఆర్&బి జంక్షన్ సమీపంలో నూకాంభికా అమ్మవారిని శ్రీధర్ దంపతులు దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు శ్రీధర్ దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రములో అధిక సంఖ్యలో భక్తులు, స్థానికులు మహిళలు పాల్గొన్నారు

ముగిసిన భీమిలి ఏరియా సిపిఐ మహాసభలు

విశాలాంధ్ర-తగరపువలస : సిపిఐ మహాసభలు తగరపువలస ఆఫీసు జి ఆర్ భవన్ లో సిపిఐ జిల్లా సెక్రెటరీ పైడిరాజు ఆధ్వర్యంలో జరిగినవి. సిపిఐ పార్టీ కార్యకర్తలు అందరూ హాజరైన ఈ సభలో ఏరియా కార్యదర్శిగా కానూరు రాంబాబు సహాయ కార్యదర్శిగా మారా అప్పలరాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంలో పార్టీ కార్యకర్తలకు అధ్యక్ష వర్గంగా ఉన్న వారికి విప్లవ అభినందనలు తెలియజేస్తూ భీమిలి ఏరియాలో అసంపూర్తిగా ఉన్న అనేక సమస్యలు మీద సిపిఐ పార్టీగా మన వాణి వినిపించి పోరాటాలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఏరియా కార్యదర్శిగా సహాయ కార్యదర్శిగా ఎన్నికైన కానూరు రాంబాబు,మారా అప్పలరాజులు తెలిపారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు దాటినా ప్రజల సమస్యలు పట్టించు కోవడం లేదు ముఖ్యంగా పేద వాళ్ళ సమస్యలు పేదవానికి రెండు సెంట్లు ఇళ్ల స్తలాలు నిర్మాణానికి ఇచ్చే ఐదు లక్షలు, రెండు పెన్షన్లు వికలాంగులు వితంతువు కిడ్నీ పేషెంట్లు, దీర్ఘకాలిక అనారోగ్య పేషెంట్లకు ఇచ్చే పెన్షన్లు కూడా కొత్తవి ఇచ్చినట్లయితే వారి యొక్క బాధల్ని తొలగించేవారు అవుతారని తెలిపారు. సచివాలయాలకి తగిన ఆదేశాలు ఇచ్చి దరఖాస్తులు చేసుకునే అవకాశాన్ని ప్రజలకి కల్పించాలని కోరారు.

ఉడా చిల్డ్రన్ ఎరీనాలో

నేడు విశ్వావసు నామ ఉగాది వేడుకలు

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: స్థానిక ఉడా చిల్డ్రన్ ఎరీనాలో ఆదివారం ఉదయం నుంచి విశ్వావసు నామ ఉగాది వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. వేడుకలకు రాజకీయ, అధికార ప్రముఖులను, ప్రజలను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9.00 గంటలకు వేడుకలు ప్రారంభంకానున్నాయని, నూతన తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని శాస్త్రోక్త పూజలు, వేదపారాయణ మంత్రోచ్చరణల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేదపండితులు వేదపారాయణం, పంచాగ శ్రవణం, వేద పండితుల ఆశీర్వచనం, కవిసమ్మేళం ఉంటుందన్నారు. ఉగాది పచ్చడితో పాటు ఇతర సంప్రదాయ ప్రసాదాలను ప్రజలకు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. వివిధ పాఠశాల విద్యార్థులు, కళాకారుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, విశ్వావసు నామ సంవత్సర విశేషాలను పంచాంగ కర్తలతో పాటు, కవులు వివరించనున్నారని, అధికారులు, రాజకీ య ప్రముఖులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు ఆశీలయ్యేందుకు వీలుగా, వేడుకలను వీక్షించేందుకు అనువుగా ఏర్పాట్లు చేశామని వివరించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి, విశాఖపట్టణం ఆర్డీవో కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు, అధికారులు, రాజకీయ ప్రముఖులు, విద్యార్థులు ఉగాది వేడుకల్లో భాగస్వామ్యం కావాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

తాగునీరు, యుజిడి, వీధి దీపాల సమస్య సత్వరమే పరిష్కరించాలి

5వ వార్డు కార్పొరేటర్ హేమలత

విశాలాంధ్ర-పీఎం పాలెం: జీవీఎంసీ 5వ వార్డ్ సమస్యల పై ఆ వార్డ్ కార్పొరేటర్ మొల్లి హేమలత శనివారం ఇంచార్జ్ కమిషనర్ అయినా కలెక్టర్ హరేందర్ ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యం గా వార్డులో యూజీడి,త్రాగునీరు, వీధిదీపాల సమస్య ఎక్కువగా ఉన్నదని, వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధులతో సాయిరాం కాలనీలో నిర్మిస్తున్నటువంటి త్రాగునీటి స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయని వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ ప్రాజెక్టు పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని,పరదేశిపాలెం, బోరవానిపాలెం,కొత్తపాలెం, సాయిరాం కాలనీలలో గల స్మశాన వాటికల అభివృద్ధి పనులు చేపట్టాలని,వార్డ్ లో గల బొట్టవాని పాలెం,నగరం పాలెం చెరువులను అభివృద్ధి చేయాలని జీవీఎంసీ కౌన్సిల్లో కలెక్టర్ హరేందర్ ప్రసాద్ కు వివరించి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. సానుకూలంగా స్పందించి ఆ సమస్యల పరిష్కారానికి తొందర్లోనే చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారని ఆమె అన్నారు.

రేషన్ కార్డుదారులకు ఈకెవైసి తేదీని పొడి గించండి : సీపీఐ

విశాలాంధ్ర-పెదగంట్యాడ : రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు ఈ కెవైసి నీ చేసుకోవడానికి ఈ నెల 31 వరకు గడువు ఇచ్చిందని, ఈ గడువును పొడిగించాలనిసిపిఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు శని వారం సిపిఐ ప్రతినిధి వర్గం పౌర సరఫరాల శాఖ గాజువాక సర్కిల్-3 అధికారికి వినతిపత్రం అందజేసింది. అనంతరం సిపిఐ గాజువాక నియోజకవర్గ నాయకులు కె.అచ్యుతరావు మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు ఈకెవైసి తేదీని పొడిగిస్తే బాగుంటుందన్నారు. చాలా మంది రేషన్ కార్డుదారులకు తేదీ ముగుస్తుందని తెలియదని అన్నారు. తక్షణమే సర్కిల్-3 అధికారులు స్పందించి తేదీ నీ పొడిగించాలని కోరారు. సర్కిల్ 3 అధికారికి వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఐ గాజువాక నియోజకవర్గ నాయకులు జి.ఆనంద్, పి.దుర్గారావు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.వనజాక్షి ఉన్నారు.

గీతంలో ఉగాండా విద్యార్థుల సమావేశం

విశాలాంధ్ర-మధురవాద: భారతదేశంలో ఉగాండా విద్యార్థుల సంఘం (అసోసియేషన్ ఆఫ్ ఉగాండా స్టూడెంట్స్ ఇన్ ఇండియా) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా మార్చి 28 మరియు 29 తేదీల్లో ఉగాండా విద్యార్థుల రాష్ట్ర స్థాయి సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాలకు గీతం తో పాటు ఆంధ్రవిశ్వవిద్యాలయం, , కేఎల్‌యూ తదితర విద్యాలయాల నుండి ఉగాండా విద్యార్థులు మరియు న్యూఢిల్లీ లోని ఉగాండా హైకమిషన్ కార్యాలయం నుంచి ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం పాల్గొంది. సమావేశాలలోఉగాండా విద్యార్థుల మరియు ముఖ్య ప్రభుత్వ అధికారుల మధ్య పరస్పర చర్చలకు ఒక కీలక వేదికను అందించింది, విద్య, కెరీర్ అవకాశాలు విద్యార్థి సంక్షేమంపై ఉగాండా అధికారిక బృందం చర్చలు జరిపాయి. ఉగాండా హైకమిషన్ నుండి వచ్చిన ప్రతినిధులలో విద్యాశాఖ అధికారి బలున్యా బేకర్, పౌరసత్వ మరియు వలసల దివిజన్ డైరెక్టర్ మేజర్ జనరల్ అపోలో కాసీతా, వలసల నియంత్రణ కమిషనర్ కల్నల్ జోఫ్రీ బ్రైయన్ కబేరు, సీనియర్ వలసల అధికారి ఇమ్మాన్యుయెల్ అజీజి, ఉగాండా హైకమిషన్ (న్యూ ఢిల్లీ) డిఫెన్స్ సలహాదారు కాలనల్ సైమన్ ఒయో, మిలటరీ అసిస్టెంట్ టు ది డైరెక్టర్ ఆఫ్ ఇమ్మిగ్రేషన్ లెఫ్టినెంట్ కాలనల్ సైమన్ కాళుంబా విద్యార్థులతో వివిధ అంశాలపై చర్చించారు. ప్రతినిధులు విద్యార్థులతో , విద్యా అవకాశాలు, కెరీర్ మార్గాలు అంతర్జాతీయ విద్య యొక్క ప్రాముఖ్యతపై చర్చించారు. గీతం విశ్వవిద్యాలయంపై ప్రశంసలు కురిపించారు. గీతం ప్రో వైస్-చాన్సలర్ ప్రొ. వై. గౌతమరావు ఉగాండా ప్రతినిధులతో జరిగిన సమావేశంలో గీతంలో అంతర్జాతీయ విద్యార్థులకు సంబంధించిన ప్రత్యేక సౌకర్యాలను, విద్యా సాంస్కృతిక మార్పిడి ప్రోగ్రామ్స్ గురించి వివరించారు. గీతం లో ప్రపంచ స్థాయి అధ్యాపకులు, పరిశోధన ఆధారిత అభ్యాసం పరిశ్రమకు సంబంధించిన అనుభవం ద్వారా అంతర్జాతీయ విద్య కేంద్రంగా బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. గీతం అంతర్జాతీయ విద్యార్థివ్యవహారాల డైరెక్టర్ డా.కే.పి.కిషన్, అంతర్జాతీయ విద్యాధికారి చంద్రనేష్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఐదు శాఖల్లో ఉన్న పార్టీ సభ్యులు విధిగా హాజరుకావాలి : సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల

విశాలాంధ్ర-మల్కాపురం: 63వ వార్డు పరిధిలోగల కాకరలోవ కూడలిలో సిపిఐ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కాంద్రేగుల సత్యాంజనేయ, సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు హాజరై సిపిఐ పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఐదు శాఖలలో శాఖా మహాసభలు జరపాలని తీర్మానించారు. ఈ తీర్మానంలో 2025 ఏప్రిల్ 2న శ్రీహరిపురం శాఖా మహాసభ లు జరుగుతున్నాయని అన్నారు. మల్కాపురం శాఖా మహాసభలు 2025 ఏప్రిల్ 6న జరగనున్నాయని, గాంధీ గ్రామ్ శాఖ మహాసభలు 2025 ఏప్రిల్ 4న జరగనున్నాయని తెలిపారు. అలాగే కాకరలోయ శాఖ మహాసభలు 2025 ఏప్రిల్ మూడో తేదీ సాయంకాలమున జరగనున్నాయని, జనతా కాలనీ శాఖ మహాసభలు 2025 ఏప్రిల్ 5వ తేదీ సాయంకాలం మహాసభలు జరుగుతాయని చెప్పారు. ఐదు శాఖలలో ఉన్న పార్టీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని 2025 మే 10 వ తారీకు 11వ తారీకు విశాఖ జిల్లా మహాసభ లు కంచరపాలెంలో జరుగు తున్నాయి. కావున పార్టీ సభ్యులందరూ సకాలంలో రావాలని పిలుపునిచ్చారు.

జాతీయ యూత్ పార్లమెంటుకు విశాఖ నుంచి ముగ్గురు ఎంపిక

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : జాతీయ స్థాయి యూత్ పార్లమెంట్ కు విశాఖపట్నం నోడల్ ఏజెన్సీ నుండి ముగ్గురు విద్యార్థినిలు ఎంపికైనట్లు నెహ్రూ యువ కేంద్ర యువ అధికారి జి. మహేశ్వర రావు తెలియజేశారు. జ్యోత్స్న, లాస్య, శివాని ఈ ముగ్గురు వచ్చే నెలలో జరిగే జాతీయ స్థాయి యువ పార్లమెంట్ పార్లమెంట్ లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని తొమ్మిది నోడల్ ఏరియాలో ప్రాథమిక స్థాయి ఎంపిక నిర్వహించి ఒక్కొక్క ప్రాంతం నుంచి పది మంది చొప్పున రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మార్చి 28న నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో 90 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. రాష్ట్రం నుంచి కేవలం ముగ్గురుకి మాత్రమే జాతీయ స్థాయి పోటీలకు అవకాశం ఉండగా ఆ ముగ్గురు విశాఖపట్నం నోడల్ ఏరియా నుంచి ఎంపిక అయ్యారని మహేశ్వరరావు తెలియజేశారు.

నేడు, రేపు కూడా ఆస్తి పన్ను చెల్లించవచ్చు

జీవీఎంసీ కమిషనర్ ఎమ్.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో గల గృహ యజమానులు / ఆస్తిపన్ను చెల్లింపుదారులు నేడు, రేపు ప్రభుత్వ సెలవు దినాలైనప్పటికీ ఆస్తి పన్ను చెల్లించవచ్చని జీవీఎంసీ కమిషనర్ ఎమ్.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) ఎస్.శ్రీనివాసరావు శనివారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. మార్చి 30వ తేదీ ఆదివారం ఉగాది, 31వ తేదీ సోమవారం రంజాన్ పర్వదినాల సందర్భంగా ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ జీవీఎంసీ ప్రధాన కార్యాలయం తో పాటు అన్ని జోనల్ కార్యాలయాలలో గల సౌకర్యం కేంద్రాలు ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఆస్తి పన్నుదారుల ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపుల కొరకు పనిచేస్తాయని, కావున ఇంటి పన్ను , ఖాళీ జాగా పన్నుల బకాయి దారులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024 -25 సంవత్సరములకు సంబంధించి ఆస్తి పన్నులను చెల్లించి వడ్డీలో 50 శాతం రాయితీను పొందవచ్చు నన్నారు. 2025 మార్చి 31వ తేదీ తరువాత ఆస్తి పన్నులు చెల్లించిన వారికి వడ్డీ పై రాయితీ ఉండదన్నారు. కాబట్టి ప్రభుత్వం కల్పించిన ఆస్తి పన్నులపై వడ్డీలో 50 శాతం రాయితీ సదవకాశాన్ని ఆస్తి పన్నుదారులు మార్చి 31వ తేదీ లోగా పొంది పన్నులను చెల్లించవచ్చునన్నారు. ఆస్తి పన్ను చెల్లించి విశాఖ నగరాభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంగరంగ వైభవంగా శ్రీ నూకాలమ్మ జాతర

విశాలాంధ్ర-పెందుర్తి: పెందుర్తి మండలంలోని పలు ప్రాంతాలలో కొత్త అమావాస్య సందర్భంగా శ్రీ నూకాలమ్మ జాతరలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. పెందుర్తి కూడలిలో గల ప్రఖ్యాత శ్రీ నూకాలమ్మ ఆలయం వద్ద ఉదయం నుండి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, జీవీఎంసీ టిడిపి ఫ్లోర్ లీడర్ పీల శ్రీనివాసరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, వేగి దివాకర్, ఆర్ఎస్ నాయుడు, గొర్లె అప్పారావు, కొరుపోలు రామనాయుడు, అయితి సింహాచలం, బైలపూడి హరగోపాల్, శరగడం నరసింహమూర్తి, వైసీపీ సీనియర్ నాయకుడు మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పెందుర్తి జే ఎన్ ఆర్ ఎం కాలనీ, జీవీఎంసీ 95 వ వార్డు వరలక్ష్మి నగర్, లక్ష్మీపురం, జీవీఎంసీ 94 వ వార్డు అప్పల నరసయ్యమ్మ కాలనీలలో శ్రీ నూకాలమ్మ జాతరలు కనులు పండువుగా సాగాయి. నూకాలమ్మ జాతరను పురస్కరించుకుని పెందుర్తి కూడలిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి ఆలయంతో పాటు రోడ్డు కిరువైపులా భారీ ఎత్తున విద్యుత్ దీపాలతో అలంకరించారు.

భక్తులతో కిక్కిరిసిన బైరవాలయం

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి దేవస్థానం అనుబంధ దేవాలయం, క్షేత్రపాలకుడు అయిన భైరవ స్వామివారి ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. శనివారం అమావాస్య కావటంతో స్వామివారి ఆలయంకు భక్తులు పోటెత్తెరు. భైరవ స్వామివారికి నువ్వుల నూనెదీపం వెలిగించటం ఆచారం. స్థానికంగా ఉన్న భక్తులు కాకుండా అధికంగా నగరం, ఇతర రాష్ట్రాలు, జిల్లాల నలుమూలల నుండి భక్తులు వచ్చి ఇక్కడ భైరవ స్వామివారికి తైలాభిషేకం, పంచామృత అభిషేకాలు చేసి చివరిగా కొబ్బరి నీళ్ళతో అభిషేకించి పూలతో అలంకరించి, దూపదీప నైవేద్యాలు పెట్టి మొక్కులు చెల్లిస్తే భక్తులకున్న మానసిక, ఇతి, ఆర్థిక, రాజయోగం కావాలన్న, ఎన్నికల్లో నెగ్గాలన్న, శత్రు, నరఘోష , పీడకలలు, ప్రమాదాలు మొదలగు బాధలన్నీ తొలగు తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. భక్తుల రద్దీని ముందుగానే ఊహించిన పోలీస్ ఉన్నత అధికారులు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైం పోలీస్ అధికారులను, సిబ్బందిని బందోబస్తు వేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు తనదైన శైలిలో ఏర్పాట్లు చేశారు.

నూకాంబిక అమ్మవారి సేవలో అయితంశెట్టి గోపి..

విశాలాంధ్ర -గోపాలపట్నం: జీవీఎంసీ 89 వ వార్డు ఎల్లపు వానిపాలెం గ్రామంలో కోబ్రా ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో కొత్త అమావాస్య పురస్కరిం చుకునీ శ్రీ నూకంబిక అమ్మవారి పండుగ ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామస్తులు కమిటీ సభ్యులు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు కార్యక్రమంలో 89 వ వార్డు టిడిపి నాయకులు ఐతంశెట్టి గోపి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాగర్ నగర్ లో టీడీపీ పార్టీ జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర-సాగర్‌నగర్ : 43 వ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సాగర్ నగర్ లో తెలుగు దేశం పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి వార్డు కార్పొరేటర్ లోడగల అప్పారావు డివిజన్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బోడెపుడి దొరబాబు డివిజన్ ఉపాధ్యక్షుడు సారిపల్లి శ్రీనివాస్ మహిళా ప్రతినిధి శతపతి మంగాదేవి యువత అధ్యక్షుడు ఒమ్మి బాబురావు బీసీ సెల్ అధ్యక్షుడు దువ్వి పరమేశ్వరరావు తెలుగుదేశం నాయకులు బొడ్డు శ్రీనివాస్ తోకల నాగేశ్వరరావు బోనాల కృష్ణ బెల్లాన్ని శ్రీనివాస్ కమ్మ నరేంద్ర ప్రసాద్ పట్నాల సూరిబాబు అలాంటి అప్పలరాజు దబ్బాడ వెంకటరమణతదితర తెలుగుదేశం నాయకులందరూ పాల్గొన్నారు.

మార్చి 30, 31 పారిశుద్ధ్య కార్మికులకు సెలవు

తమ ఇంటి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో వేయరాదు

కలెక్టర్, జివిఎంసి కమిషనర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ మార్చి 30 (ఆదివారం), 31(సోమవారం) దినములలో ఉగాది, రంజాన్ సందర్భంగా క్లాప్ వాహనముల ద్వారా వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు సెలవు దినములుగా ప్రకటించడమైనదని విశాఖ జిల్లా కలెక్టర్ మరియు జివిఎంసి కమిషనర్ ఎమ్. ఎన్. హరేంధిర ప్రసాద్ నగర ప్రజలకు శనివారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. కావున తమ వద్ద ఉన్న వ్యర్థాలను వీధులలో, బహిరంగ ప్రదేశాలలో పడవేయకుండా పబ్లిక్ బిన్స్ లలో వేయగలరని లేదా తమ వద్దకు తేది.01-04-2025న మంగళవారం క్లాప్ వాహనముల ద్వారా వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు తడి, పొడి చెత్తగా విభజించిన వ్యర్థాలను అందించాలని , ఈ విషయమై విశాఖ జీవీఎంసీ కి సహకరించాలని విశాఖ జిల్లా కలెక్టర్ మరియు జివిఎంసి కమిషనర్ తెలియజేశారు.

నూకాలమ్మ అమ్మవారి ఉత్సవ సందర్భంగా అన్నసమారాధన

విశాలాంధ్ర-పెదగంట్యాడ : శనివారం కొత్త అమావాస్య సందర్భంగా అయ్యన్నపాలెం గ్రామంలో నూకాలమ్మ అమ్మవారి ఉత్సవ సందర్భం గా మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికిజీ వి ఎం సి 75 వార్డు కార్పొరేటర్ అండ్ పులి లక్ష్మీ బాయి వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొందేశి అప్పల రెడ్డిగారు గోందేశి పైడి రెడ్డి, ముద్దుర్తి శ్రీరామమూరి, మొల్లి రమణ, గొందేసి అనిత అప్పల రెడ్డి (బుల్లెట్ రెడ్డి), కొయ్య భారతి , వై శ్రీనివాస్ రెడ్డి(వై యస్ ఆర్), పూడి హరీష్, మొల్లి అప్పలనాయుడు, గొందేసి హరీష్ రెడ్డి, సూరిబాబు గారు గొందేశి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీ పైడితల్లమ్మ, సాధుమఠం ఉత్సవ మహోత్సవములు



విశాలాంధ్ర-ఆనందపురం : మండలంలో వెల్లంకి పంచా యతీ పరిధిలో ఉన్న ఉగాది పర్వదినాన శ్రీ పైడితల్లమ్మ, సాధుమట ఉత్సవాలు ప్రతి ఏటా మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా మూడు రోజులు పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు పైడితల్లి అమ్మవారికి, పసుపు కుంకుమ అందించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆదివారం నుండి మంగళవారం వరకు ఈ మూడు రోజులు పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవాలు నిర్వహించబడతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

శారదా పీఠంలో ఆక్రమణలు తొలగింపునకు మీనమేషాలు ఎందుకు?

తెలుగు శక్తి అధ్యక్షుడు బివి రామ్

విశాలాంధ్ర-పెందుర్తి : విశాఖ శారదా పీఠంలో ఆక్రమణలు జరిగాయని నిర్ధారించిన అధికారులు వాటిని తొలగించేందుకు మీనమేషాలు లెక్కించడం సరికాదని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి రామ్ అన్నారు. శనివారం పెందుర్తి తహసీల్దార్ ఆనంద్ కుమార్ ని కలిసిన బివి రామ్, శారదాపీఠం ఆక్రమణలు తొలగింపుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే శారదా పీఠం అధికారులు మూడు వారాలు గడువు కోరారని ఎమ్మార్వో చెప్పడంతో ఆవేదన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత అక్టోబర్ నెలలోనే శారదా పీఠంలో 22 సెంట్లు ప్రభుత్వం కలిసి ఉందని గుర్తించిన రెవెన్యూ అధికారులు ఐదు నెలలు గడిచినా, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 22న వారం రోజులు గడువిచ్చిన రెవెన్యూ అధికారులు, ఇప్పుడు మరో మూడు వారాలు గడువు ఇవ్వడం అనుమానం కలిగిస్తోందన్నారు. చట్టం నుండి తప్పించుకునేందుకు శారదాపీఠం ప్రయత్నాలు సాగిస్తోందని దానికి రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నట్లుగా కనిపిస్తుందని తెలిపారు. దేవాలయాలను కూల్చడం తన అభిమతం కాదని అయితే ఆక్రమణలు తొలగించి ప్రభుత్వమే శారదాపీఠాన్ని స్వాధీనం చేసుకొని ఉన్నతంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు శారదా పీఠాధిపతులు విచ్చలవిడిగా వ్యవహరించారని విమర్శించారు. అలాగే ప్రతిపక్ష నాయకులను ఆక్రమణల పేరిట అధికారులు ఎన్నో వేధింపులకు గురిచేసారని గుర్తు చేశారు. శారదాపీఠం ఆక్రమణలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని తెలియజేశారు.

చట్టపరంగానే వ్యవహరిస్తున్నాం : తహసీల్దార్ ఆనంద్ కుమార్

శారదా పీఠం విషయంలో చట్టపరంగానే తాము వ్యవహరిస్తున్నట్లు పెందుర్తి తహసిల్దార్ ఆనంద్ కుమార్ స్పష్టం చేశారు. శారదాపీఠం ఆక్రమణలపై ఫిర్యాదులు అందడంతో ఆ ప్రాంతాన్ని సర్వే చేసి 22 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగినట్లు నిర్ధారించామని వెల్లడించారు. ఈ విషయమై శారదా పీఠానికి నోటీసులు జారీ చేయగా సంబంధిత పత్రాలు అందజేయడానికి మూడు వారాలు గడువు కోరినట్లు తెలియజేశారు. అప్పట్లోగా సరైన పత్రాలు చూపకపోతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని తెలిపారు. గతంలో పంచాయతీ తీర్మానం మేరకు శారదా పీఠంలో కొన్ని భవనాల నిర్మాణం జరిగిందని తహసిల్దార్ వెల్లడించారు.

కళా రత్నా పురస్కారానికి చలపతిరావు ఎంపిక..

విశాలాంధ్ర-మల్కాపురం: చిత్రకళా విశ్లేషణ రచన విమర్శ నిర్వహణలలో అర్థ శతాబ్దంగా అంకితభావం చిత్త శుద్ధితో కృషి చేస్తున్న వ్యక్తి, వక్త సుంకర చలపతిరావు ప్రభుత్వపరంగా వారికి ఎప్పుడో రావాల్సిన గుర్తింపు ఇప్పటికైనా రావడం చిత్రకళా రంగం ఆనందం వ్యక్తం చేస్తుందని ఆయనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "కళారత్న" అవార్డు ను ఉగాది రోజున బహుకరించ నున్నట్టు సాంస్కృతిక శాఖ డైరెక్టర్ తెలియజేసారు. చలపతిరావు 1971 సం॥ లో తొలిసారి ఒక చిత్ర కళా ప్రదర్శన గురించి ఆయన చిత్రకళా గురువు వెల్లటూరి పూర్ణానంద శర్మ సహకారంతో రచించారు. నాటినుండి ఇప్పటివరకు వివిధ దిన, వార, మాసపత్రికల్లో చిత్రకళా చిత్రకారులు కళా ప్రదర్శనల గురించి ఐదు వందల వ్యాసాలు రచించారు. నేటి ప్రముఖ చిత్రకారులైన వడ్డాది పాపయ్య, ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఆశవు అప్పా రావు శాలా పద్మ, మరగంటి సీతారామచార్యులు, అద్దంకి వెంకటేశ్వరరావు కొమ్మోజు నరసింహ చార్యులు, బాలయ్య, కి కళాకారుడు పి వేణుగోపాల రెడ్డి డాఎ వేలూరి రాధాకృష్ణ శిష్ల రామకృష్ణారావు బాలి, అంట్యాకుల పైడిరాజు వంటి వారిని కళాభిమానులకు పరిచయం చేసింది చలపతి రావే అంటే అతిశయోక్తి కాదు.ఆంధ్ర చిత్ర శిల్పులు చిత్ర కళా రత్నాలు రంగుల రారాజు వడ్డాది పాపయ్య, దామెర్ల రామారావు, జాతిరత్నం వడ్డాది పాపయ్య, రాజా రవి వర్మ, చిత్రకళా వైభవం వంటి చిత్రకళ గ్రంథాలు రచించి ప్రచురించారు. ఇవి కాక విశ్వ చిత్ర కళా మాసపత్రికకు చిత్రకళ పరిషత్ రజతోత్సవ సంచిక, లేఖలు, రాగతి పండరి ఆత్మకథ, చిత్ర కళా చరిత్ర, వపా శతజయంతి సంచిక, వపా కార్టూన్లు, రత్న చిత్ర తదితర గ్రంథాలకు సంపాదకులుగా వివహరించారు.నవరంగ్ చిత్ర కళా నికేతన్ వెల్లటూరు, షిప్ యార్డ్ రచయితల సంఘం వ్యవస్థాపకులలో ఆయన ఒకరు విశాఖకు చెందిన లలిత కళా పరిషత్ సహాయ కార్యదర్శిగా చిత్ర కళా పరిషత్తుకు ప్రధాన కార్యదర్శిగా మూడున్నర దశాబ్దాలు ఉండి విశాఖలో అనేక చిత్రకళా పోటీలు ప్రదర్శనలు నిర్వహించారు. సిందియా, మల్కాపురం గాజువాక శాఖ గ్రంధాలయం లల్లో అనేక కళ సాహితీ కార్యక్రమాలు జయప్రదంగా నిర్వహించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో పలువురు సీనియర్ చిత్రకారుల తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. విశాఖపట్నం పారిశ్రామిక ప్రాంతంలో ఈనాడు, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, తదితర దినపత్రికలలో రెండు దశాబ్దాలపాటు విలేకరిగా పనిచేసి ఈ ప్రాంతం సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.'1989 సం॥ లో లలిత కళా అకాడమీ న్యూఢిల్లీ నిర్వహించిన జాతీయస్థాయి సెమినార్లో పాల్గొన్నారు. వెల్లటూరు, విజయవాడ, గన్నవరం, పాలకొల్లు, రాజమండ్రి, అనకాపల్లి, అమలాపురం, చోడవరం, పార్వతిపురం, శ్రీకాకుళం లో జరిగిన సమావేశాల్లో సన్మానాలు సత్కారాలు పొందారు చిత్ర కళా పరిషత్ ద్వారా యారాడ, సింహాచలం, భీమిలి, కోణార్క్ లో చిత్రకళ శిబిరాలు జయప్రదంగా నిర్వహించారు. చిత్రకళ పై తెలుగులో వచ్చిన 100కు పైగా గ్రంధాలు సావనీర్లు చలపతిరావు వద్ద ఉన్నాయి. ఆకాశవాణి విశాఖ కేంద్రం నుండి గత పాతికేళ్లల్లో అనేక ప్రసంగాలు చేశారు. పలువురు సీనియర్ చిత్రకారులు ఒరిజినల్ చిత్రాలు ఆయన వద్ద ఉన్నాయి తెలుగు చిత్రకళ కు చిరునామా గా ఉన్న చలపతిరావు ప్రస్తుతం చిత్రకళా పరిషత్ విశాఖకు విశాఖపట్నం పారిశ్రామిక ప్రాంతం విలేకరుల సంఘానికి గౌరవాధ్యక్షులుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిత్ర కళా రంగానికి ఆయన చేసే సేవల్ని గుర్తించడం అంటే తెలుగు చిత్రకళను గుర్తించడమేనని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన కళారత్న ను ఈనెల 30న విజయవాడలో తుమ్మపల్లి కళాక్షేత్రంలో అందజేయనున్నారు. అవార్డు కింద రూ 50 వేల నగదుచ హంస ప్రతిమ, శాలువా, ప్రశంసా పత్రం అందజేయనున్నారు.

నేడు 6.30 ని.ల నుండి సర్వ దర్శనాలు

విశాలాంధ్ర-సాగర్‌నగర్ : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం(టిటిడి) లో ఆదివారం తెలుగు నూతన సంవత్సరం ఉగాది సందర్భంగా ఉదయం 6.30 ని॥ల నుండి భక్తులకు సర్వదర్శనాలను కల్పించ నున్నట్లు ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. 9 గం.లకు పంచాంగ శ్రవణం నిర్వహించనున్నామని రాత్రి 9.30 ని.ల వరకు భక్తులకు సర్వ దర్శనాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా క్యూలైన్లను, టెంట్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

వాయు నాళాల సంరక్షణ కై సిప్లా బ్రీత్ ఫ్రీ యాత్ర

విశాలాంధ్ర-విశాఖపట్నం: వాయు నాళాల సంబంధిత ఆరోగ్యము వాటికి సంబంధించి ప్రభావవంతమైన థెరపీ పరిష్కారాలు అందించడము పట్ల అవగాహన కలిగించాలనే సిప్లా లిమిటెడ్, రోగికి సపోర్ట్ అందించే ఇనీషియేటివ్, బ్రీత్ ఫ్రీ యాత్ర అని డాక్టర్ మోన్సిహా షిల్లా చెప్పారు. బ్రీత్ ఫ్రీ యాత్రతో. వ్యక్తులకు వారి వాయు నాళాల ఆరోగ్యముని అసెస్ చేయడానికి మరియు అర్థము చేసుకోవడానికి సహాయము చేయడమే ఈ యాత్ర ఉద్దేశ్యమన్నారు. దీర్ఘకాల ఊపిరి రోగాలైన ఉబ్బసము సిఓపిడి (క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మోనరీ డిసీజ్) వంటి వాటి స్క్రీనింగ్ ఛానెల్సుకి యాక్సెస్ మెరుగుపరచడమే ఈ యాత్ర ఉద్దేశ్యము అన్నారు. ఈ బ్రీత్ ఫ్రీ యాత్ర, 335 పట్టణాలకు ప్రయాణము చేసింది, 6,600 కి క్యాంపులు నిర్వహించిందన్నారు. భారతదేశము అంతటా 10 లక్షల రోగులకు సపోర్ట్ అందించిందన్నారు. పెరుగుతున్న సవాళ్ళ మధ్య వాయు నాళాల ఆరోగ్యము మీద ఫోకస్ పెట్టడం అత్యంత ఆవశ్యకమని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ మోన్సిహా షిల్లా చెప్పారు.

కనెక్టెడ్ సొల్యూషన్స్‌ను ఆవిష్కరించిన లారిట్జ్ నడ్సెన్ ఎలక్ట్రికల్ అండ్ ఆటోమేషన్

విశాలాంధ్ర-విశాఖపట్నం: భారతదేశంలో ఎలక్ట్రికల్, ఆటోమేషన్ పరిశ్రమలో అగ్రగామి సంస్థ లారిట్జ్ నడ్సెన్ ఎలక్ట్రికల్ అండ్ ఆటోమేషన్ (గతంలో ఎల్అండ్‌టీ స్విచ్‌గేర్)దేశంలో సాగు రంగానికి తోడ్పాటు అందించేందుకు అధునాతన సొల్యూషన్స్‌ను ఆవిష్కరించింది. రైతులు వనరులను సమర్ధవంతంగా నిర్వహించుకునేందుకు, ఉత్పాదకతను, దిగుబడులను పెంచుకునేందుకు ఈ వినూత్న ఉత్పత్తులు, సొల్యూషన్స్ తోడ్పడతాయి. స్మార్ట్ ఆటోమేషన్‌తో వ్యవసాయంలో కొత్త ఆవిష్కరణలు మెరుగైన స్మార్ట్ కామ్ ఇరిగేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐఎంఎస్) దన్నుతో ఆధునిక వ్యవసాయ సవాళ్లను ఎదుర్కొనేందుకు తాజా అధునాతన సొల్యూషన్స్ ఉపయోగపడతాయి. స్మార్ట్ కోమ్ ఐఎంఎస్ అనేది ఒక ఇంటెలిజెంట్, ఆటోమేటెడ్ వ్యవస్థ. యుజర్లకు అనుకూలమైన డ్యాష్‌బోర్డులు లేదా మొబైల్ యాప్‌ల ద్వారా వారు తమ పంటభూములను రిమోట్‌గా పర్యవేక్షించుకునేందుకు ఉపయోగపడుతుందని సంస్థ ప్రతినిధి చెప్పారు.

20 లక్షలకు పైగా కార్డులు జారీ చేసిన టాటా న్యూ క్రెడిట్ కార్డు

విశాలాంధ్ర-విశాఖపట్నం: కీలక మైలురాయిని సూచిస్తూ, 20 లక్షల పైగా టాటా న్యూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డులను జారీ చేసినట్లు టాటా న్యూ మరియు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించాయి. తద్వారా దేశవ్యాప్తంగా కస్టమర్లకు మరింత విలువను చేకూరుస్తూ, ప్రయోజనాలను అందించడంలో కార్డు విజయవంతమైనట్లు టాటా డిజిటల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ గౌరవ్ హజ్రతి తెలిపారు. 2022 ఆగస్టులో ప్రవేశపెట్టినప్పటి నుంచి, ఈ క్రెడిట్ కార్డు భారతీయ మార్కెట్లో అత్యంత సరళమైన, పారదర్శకమైన రివార్డ్స్ వ్యవస్థను అందించడం ద్వారా వినియోగదారులు మెచ్చిన కార్డుగా మారింది. 13 శాతం మార్కెట్ వాటా కలిగి ఉందన్నారు. టాటా న్యూ వ్యవస్థవ్యాప్తంగా కిరాణా, మందులు, బిల్లుల చెల్లింపులు, యూపీఐ, గిఫ్ట్ కార్డులు, ఆర్థిక సేవల నుంచి ఫ్యాషన్, కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్, ట్రావెల్, వినోదం లాంటి జీవన శైలి ఆధారితమైన వాటి వరకు రివార్డులన్నీ సమగ్రంగా అనుసంధానించబడతాయన్నారు.

యూనిక్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కోనేటి ఆదినారాయణకు సన్మానం

విశాలాంధ్ర-పెందుర్తి : మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ ప్రతిభ సేవా సంస్థ ఉగాది అవార్డుల కార్యక్రమంలో పెందుర్తి యూనిక్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కోనేటి ఆదినారాయణను ఆణిముత్యం జీవిత సాఫల్య పురస్కారం, గురుబ్రహ్మ పురస్కారాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కృష్ణమూర్తి,,విల్లూరి భాస్కరరావు, ప్రొఫెసర్ సూరంపూడి మాస్టర్, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజు, మెడికవర్ ఆసుపత్రి డాక్టర్ శ్రీకాంత్ ,ప్రముఖ కవి సతివాడ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ చిన్న వయస్సులో నానీ సార్ ఇన్ని పురస్కారాలు సాధించడం మంచి పరిణామం అని ఇంకా ఎన్నో అవార్డులు సాధించాలని, సమాజాసేవ చేస్తూ మంచి విద్యా బోధన చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ కోనేటి విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు. సత్కారం పొందిన కోనేటి ఆదినారాయణ మాస్టర్ కు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా అభినందనలు తెలియజేశారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

సీనియర్ కార్యకర్తలకు సన్మానం

విశాలాంధ్ర-విశాఖ సిటీ: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినో త్సవ సందర్భంగా శనివారం జిల్లా తెలు గుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అధ్యక్షతన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని విశాఖ లోక్ సభ సభ్యులు శ్రీభారత్, భీమిలి శాసనసభ సభ్యులు గంటా శ్రీనివాసరావు ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రీ భరత్ మాట్లాడుతూ టీడీపీ లో కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. యువ నాయకులు లోకేష్ నాయకత్వంలో పార్టీ మరెంతో ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. టీడీపీ సీనియర్ కార్యకర్తలను యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని దేశవిదేశాల్లో పండగ వాతావరణంలో జరుపుకుంటున్నారన్నారు. అన్న ఎన్ టి ఆర్ తెలుగువారి ఆత్మ గౌరవం కోసం తెలుగుదేశం పార్టీ స్థాపించారని అన్నారు. టీడీపీ పెట్టిన తొమ్మిది నెలలో పార్టీ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో ఎన్‌టిఆర్ ప్రజలలోకి వెళ్లారన్నారు. ఎన్ టి ఆర్ పాలన లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని పాలన ను ప్రజల వద్దకు తీసుకువెళ్లారు అని అన్నారు. సభ్యత్వాలలో ఒక కోటి మార్క్ దాటి టీడీపీ రికార్డ్ సృష్టించిందని చెప్పారు. తూర్పు నియోజకవర్గం శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ టీడీపీ వచ్చిన తరువాత బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగిందని చెప్పారు. కార్యకర్తలు ఎమ్మెల్యేలు, మంత్రులు అయింది ఒక్క తెలుగు దేశం పార్టీలోనే అని అన్నారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గం నాయకులు వెల్లంకి భరత్, టిడిపి నాయకులు గొంపా కృష్ణ, ఈతలపాక సుజాత, రాజమండ్రి నారాయణ, అనసూరి మధుసూధన రావు, తమ్మిన విజయ్ కుమార్, లొడగల కృష్ణ, ఊరుకూటి దేవిడ్, కోటా నరేష్ తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పెందుర్తిలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర -పెందుర్తి : తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం పెందుర్తి లో ఆ పార్టీ నాయ కులు ఘనంగా జరుపు కున్నారు. జీవీఎంసీ 96వ వార్డు పార్టీ అధ్యక్షుడు రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో జీవీఎంసీ టిడిపి ఫ్లోర్ లీడర్ పీల శ్రీనివాసరావు పార్టీ కార్యాలయంలో టిడిపి జెండాను ఎగర వేశారు. అనంతరం పెందుర్తి కూడలి వరకు ర్యాలీగా వచ్చారు. అక్కడ స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి విశాఖ పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షులు గండి బాబ్జి పీల శ్రీనివాసరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో సంక్షేమానికి నాంది పలికింది తెలుగుదేశం పార్టీయేనని పేర్కొన్నారు కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి నారాయణరావు, కరకదేముడు, అవగడ్డ అప్పలనాయుడు, పీలా జితేంద్ర, వేగి గోవింద్ పాల్గొన్నారు.

5వ వార్డులో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



విశాలాంధ్ర -కొమ్మాది: టిడిపి జెండా ఆవిష్కరణ చేసి పార్టీ శ్రేణులకు కార్పొరేటర్ మొల్లి హేమలత శుభాకాంక్షలు తెలియ జేశారు. టీడీపీ 43 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు 5వ వార్డు పరిధిలో గల పరదేశిపాలెం లో జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ మొల్లి హేమలత టీడీపీ జెండా ఆవిష్కరణ చేసి అనంతరం కార్పొరేటర్ హేమలత మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, అన్న నందమూరి తారక రామారావు సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి బిజెపి అధ్యక్షులు మొల్లి లక్ష్మణరావు, పార్లమెంటరీ ఉపాధ్యక్షులు పోయి వెంకటరమణ, బోయి రమాదేవి, వార్డ్ అధ్యక్షులు నాగోతి సత్యనారాయణ (జపాన్), కార్యదర్శి ఈగల రవికుమార్, యువత అధ్యక్షులు కొండపూ రాజు, చలమూరు శ్రీనివాసరావు (గడ్డి శ్రీను),కంబపు కామరాజు, జీరి గురయ్యా రెడ్డి, సుజీవరాజు,చక్రపాణి, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవం నిలబెట్టడానికి పుట్టింది టీడీపీ

తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

విశాలాంధ్ర-విశాఖ సిటీ: తెలుగువారి ఆత్మగౌరవాణి నిలబెట్టడానికి పుట్టింది తెలుగుదేశం పార్టీ అని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. శనివారం టీడీపీ 43వ ఆవిర్భావాన్ని పురస్కరించుకొని బీచ్ రోడ్ లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ. వైయస్ జగన్మోహన్ రెడ్డి 2010లో పార్టీని పెట్టి 2019లో అధికారంలోకి వచ్చా రన్నారు. అంటే దాదాపు తొమ్మిదేళ్ల పాటు తర్వాత అధికారం వచ్చిందన్నారు. కానీ నందమూరి తారక రామారావు పార్టీ పెట్టిన 9 నెలల కాలంలోనే అధికారంలోకి వచ్చి ప్రపంచ రికార్డు సాధించారన్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన అన్న నందమూరి తారక రామారావు ప్రేరణతో తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు మూలస్థంభాలు గా నిలిచి 2024 ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డి సాగనంపి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడుని చేసి తెలుగువారి పౌరుషం చాటి చెప్పారు. వేడుకల్లో తెలుగు దేశం పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి బోడేపూడి దొరబాబు, మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్యాం ప్రసాద్, టిడిపి 14 వ వార్డు అధ్యక్షుడు పి.వి.వసంతరావు, లాడి కిషోర్ కుమార్, బి.దన్వి, ఈ.సత్తిబాబు, దువ్వి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ నూకంబిక అమ్మవారిని సందర్శించిన వైసీపి మండల అధ్యక్షులు బెహరా

విశాలాంధ్ర-గోపాలపట్నం: కొత్తఅమావాస్యను పురస్కరించుకొని పలు వార్డుల్లో ఉన్న శ్రీ నూకాంబిక అమ్మవారి దేవాలయాలను బెహరా సంస్థల అధినేత వైయస్సార్సీపి మండల అధ్యక్షులు బెహరా భాస్కరరావు దర్శించు కున్నారు. 91 వ వార్డు గోపాలపట్నం మెయిన్ రోడ్డు ప్రక్కన వెలిసినటువంటి శ్రీ నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 92 వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, తెంటు రాము, గంగ వరహాలు, బుజ్జి, గొడ్డు నాగరాజు, బలిరెడ్డి శ్రీను, శివాజీ, సురేష్ వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర- పెదగం ట్యాడ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి 43 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 75 వార్డ్ సీతానగరం ఎన్.టి. ఆర్ సెంటర్ వద్ద పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమకి ముఖ్య అతిధిగా మన వార్డ్ కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబెర్ పులి ఝాన్సీ లక్ష్మి బాయి వెంకటరమణ రెడ్డి, నమ్మి అప్పారావు, పెద్దాడ సోమినాయుడు, ముసరి శ్రీనివాస్,మొల్లి రమణబాబు, గంట్యాడ పోలయ్య,ఊరుకూటి వెంకటరావు, ఊరుకుటి అప్పలరాజు, అప్పలనా యుడు, రమణ, ఈశ్వరావు, నూకరాజు, పాములు. తాతారావు, మొల్లి. సింహాద్రి, ముత్యాలు, ఎలాజి, ఎ. రాజు,. నూకరాజు, పైడయ్య, రమణ, అప్పలనాయుడు, పెంటయ్య, కొండబాబు (ఎన్టీఆర్) తదితరులు పాలుగోన్నారు.

నడింపల్లి సత్యనారాయణ రాజు కళాశాలలో

14వ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-అనందపురం: మండలంలోని సొంట్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, 14వ వార్షికోత్సవ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్లోబల్ పీపుల్ ఆపరేషన్స్ & సీనియర్ డైరెక్టర్ అర్వింద్ మాథుర్, హెచ్చ్‌నైపుణ్యలు మేనేజర్ వి.వి. రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నాణ్యమైన ఉత్తమమైన ఇంజనీరింగ్ విద్యను అందించడమే కాకుండా వృత్తి నైపుణ్యాలను పెంపొందించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్ది ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. విద్య తో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి వీలుగా కళాశాలకు అటానమస్ హోదా రావడం కళాశాల యాజమాన్యంకు ప్రత్యేకతకు నిదర్శనం అన్నారు. కళాశాల అభివృద్ధికి ఎనలేని సేవలందించిన దీర్ఘకాల అధ్యాపకులను అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవల అందించిన ఉపాధ్యాయులకు "విశిష్ట సేవా పురస్కార్", "సేవా పురస్కార్" లను వారి సేవలకు గుర్తుగా అందజేశారు. అకాడమిక్ ఎక్సలెన్స్ ప్రదర్శించిన విద్యార్థులను బహుమతులు , ధృవపత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో 3,000 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నాయి. కళాశాల నిర్వహించిన విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. సంభు ప్రసాద్, సీఎంఓ డా. పి.ఎస్. రాజు, కార్యదర్శి డా. ఎన్. ప్రసాద రాజు, చైర్మన్ నడింపల్లి సత్యనారాయణ రాజు, ఇండస్ట్రియల్ హెడ్ నవీన్, ఎన్ఎస్ఎస్ పి ఓ హరినాథ్, పీఈటీలు ఢిల్లీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ - చెత్త నుండి సంపద తయారీ కేంద్రం

విశాలాంధ్ర-ఆనందపురం: మండలంలోవెల్లంకి గ్రామ పంచాయతీ లోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రం నందు గ్రామ సర్పంచ్ ఉప్పాడ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆనందపురం మండలం లో అన్ని గ్రామ పంచాయతీ ల కార్యదర్శులు , గ్రీన్ అంబాసిడర్ ,గ్రీన్ గార్డ్స్ కు ఒక్క రోజు హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ - చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ల నిర్వహణ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఆనందపురం మండలం లోని వెల్లంకి పంచాయతీ నీ - చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ఎల్ టి సి లోకల్ ట్రైనింగ్ సెంటర్ గా ఎంపిక చేసి కేంద్రాల నిర్వహణ,తడి,పొడి చెత్త వేరు చేయుట ,సేకరించిన చెత్త ను కేంద్రాల వద్ద ఎరువు గా చేయి విధానం గూర్చి శిక్షణ అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎం.వి. ఏ శ్రీనివాసరావు , విస్తరణ అధికారి సత్యనారాయణ , పంచాయతీ కార్యదర్శులు శ్రీరామ్ మూర్తి , రామకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో సిమెంట్ రోడ్డు పనులు

విశాలాంధ్ర-ఆనందపురం : అనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామంలో ఎన్ఆర్జిఎస్ , ఎంపీపీ నిధులతో సిసి రోడ్ల పనులకు కూటమి నాయకుల ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ సీసీ రోడ్డు శ్రీరాములవారి గుడి దగ్గర నుండి బంగారమ్మ తల్లి గుడి వరకు చేస్తున్నట్లు పంచాయతీ సెక్రటరీ ప్రశాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ జ్యోతి ,కూటమి నాయకులు నాయుడు బాబు ,బన్నీ ,శంకర్, సుంకర శివ, శ్రీరామ్, కొలగాని రమణ, జనసేన నాయకులు శివ కృష్ణ, సర్పంచ్ జగదీష్, ఎంపిటిసి కనకరాజు,జాన కృష్ణ, వెంకటేష్, రామకృష్ణ , ప్రశాంత్ ,మహేష్,.పవన్ కుమార్, సాయి తేజ,, , ఇల్లాపూ వెంకట్ జగన్, గ్రామ పెద్దల దొంతల అప్పలస్వామి, చుక్క రామస్వామి, యువకులు సుబ్బు,అప్పల రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మధురవాడలో అధునాతన కళా వేదిక

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పీఎం పాలెం: బి హైదరాబాద్ రవీంద్ర భారతి స్థాయిలో మధురవాడ లో కళా వేదికను త్వరలోనే అందుబాటులోకి తీసుకు రానున్నట్టు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. శనివారం కళాభారతిలో జరిగిన లీడర్ జాతీయ నాటకోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. వి.ఎం.ఆర్.డి.ఎ. ఆధ్వర్యంలో 5 ఎకరాల సువిశాలమైన స్థలంలో అధునాతనమైన క్రీడా, సాంస్కృతిక ప్రాంగణాన్ని నిర్మించనున్నామని చెప్పారు. కళలకు పుట్టినిల్లయిన ఉత్తరాంధ్రలో నాటక రంగాన్ని ప్రోత్సహించాలనే ఆశయంతో వి.వి.రమణమూర్తి చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని పేర్కొన్నారు. జర్నలిస్టుగా ఉంటూనే స్టీల్ ప్లాంట్ వంటి సామాజిక అంశాలపైన గళాన్ని వినిపిస్తున్నారన్నారు. డిప్యూటీ స్పీకర్ కె. రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ గురజాడ అప్పారావు, ఘంటసాల, శ్రీశ్రీ, రావి శాస్త్రి, ఆరుద్ర, సిరివెన్నెల సీతా రామశాస్త్రి వంటి అనేక మంది కళాకారులను ఈ ప్రాంతం అందించిందన్నారు. ఆ వారసత్వాన్ని రైటర్స్ అకాడమీ తరపున రమణమూర్తి కొనసాగిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు, లీడర్ సంపాదకుడు వి.వి.రమణమూర్తి తదితరులు మాట్లాడారు. అనంతరం ప్రదర్శించిన ది టైగర్ మ్యాన్ మలయాళం నాటకాన్ని హోం మంత్రి వి. అనిత కూడా వీక్షించారు.

భీమిలి ప్రజల సౌభాగ్యం శ్రీ నూకాలమ్మ తల్లి

విశాఖ ఎంపి శ్రీభరత్

విశాలాంధ్ర-తగరపువలస: భీమిలి ప్రజలు సౌమ్యులు, ఆలోచనపరులు, దైవభక్తి సంపన్నులని విశాఖపట్నం పార్లమెంట్ మెంబెర్ మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. భీమిలి గ్రామదేవత శ్రీ నూకాలమ్మ అమ్మవారి మహోత్సవాలు సందర్భంగా శనివారం సాయంత్రం టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజుతో దేవాలయంను సందర్శించి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. దేవాదాయ శాఖ అధికారులు స్వాగతం పలుకగా ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి తీర్థ ప్రసాధములు అందించారు. అనంతరం మీడియాతో ఎంపి శ్రీభరత్ మాట్లాడుతూ ముందుగా భీమిలి ప్రజలు మరియు విశాఖ ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు అని చెప్పారు. శ్రీ నూకాలమ్మ తల్లి దివ్యాశీస్సులు ప్రతీ ఒక్కరికీ కలగాలని, అందరూ భాగుండాలని కోరారు. భీమిలి ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారని కానీ ఎన్నడూ ఎటువంటి చిన్న సంఘటన కూడా జరగకుండా నిర్వహించడం చాలా గొప్ప విషయమని అన్నారు. భీమిలి ప్రజల ఐక్యతకు నిదర్శనమని అన్నారు. అన్ని కులాల వారు సాంప్రదాయంగా బద్ధంగా చర్చించుకొని ఒక కమిటీ వేసి గ్రామ పెద్దలు, సంఘ పెద్దలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో అధికారుల ఆలోచనతో నిర్వహిస్తారని అన్నారు. అందుకే భీమిలి ఉత్సవాలు ఎటువంటి చిన్న సంఘటనకు దారితీయవని అన్నారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గంలో భీమిలి కూడా ఉండటం నా పూర్వజన్మ సుకృతమని అన్నారు. అందరికీ శ్రీ నూకాలమ్మ తల్లి ఆశీస్సులు కలగాలని మనస్ఫూర్తిగా కోరుతున్నానని భరత్ అన్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు అల్లిపిల్లి వేణుబాబు, సెక్రటరీ ఎచ్చెర్ల హరి, కోశాదికారి పిన్నింటి ఎర్రయ్య రెడ్డి, పాసి వినోద్ కుమార్, సన్యాసిరావుతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏ క్యు జే కళాశాలలో మెగా రక్తదానం

విశాలాంధ్ర-ఆనందపురం : మండలంలోని గుడిలోవ ఏ క్యు జే కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీజీ కళాశాల విద్యార్థులు 30 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు ఈ రక్తాన్ని రోటరీ బ్లడ్ బ్యాంకు వారు సేకరించారు. కళాశాలల కరస్పాండెంట్ ఐ హెచ్ ఫారుకీ పాల్గొని మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానం అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని అన్నారు. రక్తదానం చేయడం ఈ రోజుల్లో ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్.పి.సుధా రాణి ఎన్ ఎస్ ఎస్ పిఓ పవన్ కుమార్,విశాఖపట్నం బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యులు రామకృష్ణ , ప్రతాప్ , విశాల్ , అంకిత్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం ఆవిర్భావం ఒక సంచలనం..

ఎమ్మెల్యే గణబాబు.

విశాలాంధ్ర -గోపాలపట్నం: విశాఖపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ గణబాబు గోపాలపట్నం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి మొదలుకొని శనివారం ఉదయం బాజీ జంక్షన్, ఎన్ ఎ డి జంక్షన్ కరాస, కంచరపాలెం, రామ్ మూర్తి పంతులుపేట పాదయాత్రగా చేరుకుని స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ తెలుగుదేశం ఆవిర్భావం ఒక సంచలనం. ప్రగతి - ప్రజాసంక్షేమం కోసం ఉద్భవించిన పార్టీ తెలుగుదేశం అని అన్నారు. పేదవారి ఆకలి తీర్చేందుకు స్వర్గీయ అన్న నందమూరి తారకరామారావు రెండు రూపాయలకే కిలో బియ్యం అందించారని సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు అని నినదించారు. వెనుకబడిన, బడుగు బలహీనవర్గాలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఆదుకొని అక్కున చేర్చుకున్న పార్టీ తెలుగుదేశం అని అన్నారు. నేడు స్వర్ణాంధ్ర సాకారానికి కృషిచేస్తున్న తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యే గణబాబు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాజీ కార్పొరేటర్లు సీనియర్ నాయకులు ప్రజా ప్రతినిధులు మరియు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలకు అందించే సేవలలో అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ నగర ప్రజలకు అందించే సేవలలో, కల్పిస్తున్న మౌలిక సదుపాయాల్లో జీవీఎంసీ అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని, ప్రజల కోసం జీవీఎంసీ యంత్రాంగం కృషి చేస్తుందనే భావన ప్రజలకు కలిగేలా, విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి పరిచేలా కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, వి .ఎం. ఆర్.డి.ఎ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్ విశ్వనాథన్ లతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశం మందిరంలో నగరంలో జీవీఎంసీ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా జీవీఎంసీ కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ జీవీఎంసీ లో గల విభాగాల ద్వారా నిర్వహిస్తున్న తాగునీటి సరఫరా, వీధిలైట్లు, యు జి డి, పబ్లిక్ వర్క్స్, రోడ్లు, కాలువల అభివృద్ధి,రెవెన్యూ వసూళ్లు, పారిశుధ్య పనుల పనితీరు, ఇంటింటి నుండి వ్యర్థాల సేకరణ ,నిర్వహణ, తరలింపు, హోమ్ కంపోస్టింగ్, నగర పచ్చదనం పెంపుదల , సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ , ప్రత్యామ్నాయం, ఆర్ ఆర్ సెంటర్ల నిర్వహణ, బిల్డింగ్ ప్లాన్లు మంజూరు, టిడిఆర్ల విడుదల, స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల అభివృద్ధి, అన్నా క్యాంటీన్ల నిర్వహణ,యు సి డి ద్వారా ప్రజలకు కల్పిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, టిడ్కో గృహాల మంజూరు, 2025 సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రతిపాదనలు తదితర వాటిపై పి పి టి ద్వారా ప్రిన్సిపల్ సెక్రెటరీ కు వివరించారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు కావలసిన సేవలు అందించుటకు ,అవసరమగు మౌలిక సదుపాయాలు ,సంక్షేమ కార్యక్రమాలు అందించుటకు గాను పురమిత్ర యాప్ ను విడుదల చేసి ఉన్నదని, ఈ పురమిత్ర యాప్ ద్వారా ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం నుండి అన్ని సేవలు సులభంగా తెలుసుకునేలా, వారి వారి సమస్యలను పరిష్కరించుకునేలా , అధికారులు పనితీరుకు సులభంగా ఉండేలా ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. అలాగే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా సేవలను మెరుగుపరుచుకునేందుకు గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వాట్సాప్ 9552300009 నంబర్ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఆయన అధికారులకు సూచిస్తూ పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా వీధి దీపాలు , త్రాగునీటి సరఫరా నిర్వహించాలని, ఇంటింటి నుండి విభజించిన వ్యర్థాలను సేకరించి, నిత్యం తరలించి, వ్యర్థాలు నిర్వహణ కార్యక్రమాలు చేపట్టాలని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ శాశ్వత నిర్మూలనకు చర్యలు చేపట్టాలని, శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు సరఫరా చేస్తూ నీటి చార్జీల ద్వారా, ఇంటి పన్ను వసూళ్ల ద్వారా జీవీఎంసీ ఆర్థిక పరిపుష్టిని పెంచుకోవాలని, ప్రతి ఇంటికి నీటి కనెక్షన్లు ఉండేలా ప్రణాళికలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. నగరంలో రోడ్లు ,కాలువలు ,బహిరంగ ప్రదేశాలు నిత్యం పరిశుభ్రంతో ఉండాలని, వీధుల్లో , కాలనీలలో బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు పార వేయకుండా అపరిశుభ్ర ప్రదేశాలను నిత్యం పరిశుభ్రపరచాలని,నగర ప్రజలకు సేంద్రియ ఎరువు తయారీ పై అవగాహన కల్పిస్తూ, మిద్దె తోటలు నిర్వహిస్తూ, నగరంలో కాలుష్య నియంత్రణకు, ప్రజల ఆహ్లాద వాతావరణానికి పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని, పూర్తయిన టిడ్కో హౌసింగ్ లే అవుట్ లలో ప్రజలు నివసించేలా చర్యలు చేపట్టాలని, మెప్మా ద్వారా ప్రజల లైవ్లీహుడ్ కార్యక్రమాలను నిర్వహిస్తూ , ఎస్ హెచ్ జి గ్రూపు సంఖ్యలను పెంచాలని, ఓఎన్డిసి, రాపిడో కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవలు అందించాలన్నారు. నగరంలో వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు అవసరమాకు సస్టేనేబిలిటీ ఇనీషియేటివ్స్ 2025 26 డిస్ట్రిక్ట్ యాక్షన్ ప్లాన్ కింద ప్రణాళికలు చేపట్టాలన్నారు. అన్న క్యాంటీన్ల ను నిత్యం పర్యవేక్షిస్తూ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి, ఎస్ ఎస్ వర్మ ,ఆర్. సోమన్నారాయణ, ప్రధాన ఇంజనీర్ పి శివప్రసాద్ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎస్ వి నరేష్ కుమార్, పిడి యూసిడి పీఎం సత్యవేణి, డి సి ఆర్ ఎస్.శ్రీనివాసరావు,పట్టణ ప్రణాళిక అధికారులు మీనా కుమారి, ధనుంజయ రెడ్డి, అందరు పర్యవేక్షక ఇంజనీర్లు, అందరు జోనల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మననం చేసుకోవాలి

విశాలాంధ్ర-పద్మనాభం: శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ , రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ , భారతీయ జనతా పార్టీ పద్మనాభ మండల శాఖ , ప్రకృతి చికిత్సాలయం విశాఖపట్నం సంయుక్త నిర్వహణలో కొవ్వాడ గ్రామంలో శ్రీ సీతారామ ఆలయం ప్రాంగణంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు తామ్రపత్ర గ్రహీత రూపాకుల విశాలాక్షి 99వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మనాభం మండలం తహసీల్దార్ కే ఆనందరావు స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను ఆదర్శంగా తీసుకుం దామని సమాజానికి పిలుపునిచ్చారు. జాతీయ స్వాతంత్ర్య ఉద్యమంలో సమరయోధులది కీలక భూమిక అని అన్నారు . గాంధీజీ పిలుపునందుకొని విశాలాక్షి కుటుంబ సభ్యులు ఉప్పు సత్యాగ్రహం , క్విట్ ఇండియా , హరి జనోద్ధరణ ఉద్యమం సర్వోదయ ఉద్యమాల్లో కీలక పాత్ర వహించి జైలు శిక్ష అనుభవించారని పేర్కొన్నారు. నేటి యువతకు, సమాజానికి ఆదర్శప్రాయ%శీ%గా నాటి స్వాతంత్ర సమరయోధులు నిల్చారని, అందులో రూపాకుల విశాలాక్షి ఒకరు అని తహసిల్దార్ కొనియాడారు. 1946 వ సంవత్సరంలో తిరుపతి వెంకటేశ్వర స్వామి కోవెలలో హరిజనుల ఆలయ ప్రవేశమును 10,000 మంది కార్యకర్తల సహకారముతో విజయవంతం చేశారని తహసీల్దార్ గుర్తు చేశారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ అతిధి పద్మనాభం మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మనాభం , శ్రీ ఎం విజయ్ కుమార్ మాట్లాడుతూ రూపాకుల విశాలాక్షి చిన్నతనం నుంచే కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు అని , ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ , రాజస్థాన్ , గుజరాత్ , మధ్యప్రదేశ్ , మద్రాస్ రాష్ట్రాలలో పర్యటించి స్వాతంత్ర్య ఉద్యమము యొక్క అవశ్యకతను ప్రజలకు రూపకములు , పాటలు ద్వారా తెలియజేశారని పేర్కొన్నారు. నిరంతరము హరిజనుల అభివృద్ధి కోసం కృషి చేశారని కొనియాడారు. రూపాకుల విశాలాక్షికి కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రతినెలా తనకు వచ్చే పెన్షన్ లో సగభాగము పేద విద్యార్థుల విద్యకు , వివాహములకు ఆర్థిక సహకారం నేటికీ అందిస్తున్నారని ఎండిఓ గుర్తు చేశారు. కార్యక్ర మంలో పాల్గొన్న ప్రత్యేక వక్త ఉపాధ్యాయురాలు, వాసవి క్లబ్ ప్రతినిధి స్వప్న మాట్లాడుతూ మహిళలంతా అన్ని రంగాలలో ముందుండి స్వాతంత్ర సమరయోధుల అడుగు జాడల్లో నడవాలని కోరారు. ఇదిలా ఉండగా ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన భారతీయ జనతా పార్టీ పద్మనాభ మండల అధ్యక్షులు తమటపు నాగమణి మాట్లాడుతూ జాతీయ స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళలదే కీలక భూమిక అని రూపాకుల విశాలాక్షి స్వాతంత్రపోద్యమంలో నిరూపించారని పేర్కొన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి , సావిత్రిబాయి పూలే , సరోజినీ నాయుడు , దుర్గాబాయి దేశు ముఖ్, విజయలక్ష్మి పండిత్ మొదలగు వీర వనితలు స్వాతంత్ర ఉద్యమానికి ఊపిరి పోసారని , వీరి అడుగుజాడలే నేటి తరానికి మార్గదర్శకం అని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందుగా రూపాకుల విశాలాక్షి చిత్ర పటానికి తహసిల్దార్ కే ఆనంద్ రావు, ఎంపీడీవో ఎం ఆనంద్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి వైద్య విభాగం కన్వీనర్ రుపాకుల రవికుమార్, పద్మనాభం మండలం బిజెపి శాఖ ప్రతినిధులు, పలువురు మహిళలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు, పండ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశాలాక్షి కుటుంబ సభ్యులు , శిష్టా శ్రీలక్ష్మి , గూడా మైథిలి , జె వి శ్రీధర్ , జయంతి శేష అన్నపూర్ణ మౌనిక , శిష్టా మహేష్ , ఫణి రక్షిత్ , ఫణి కాత్య , క్షీరాబ్ది దుతి , పూజిత మరియు విశాలాక్షి ట్రస్ట్ చైర్మన్ రూపాకుల రవికుమార్, రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యుదు ఉప్పాడ అప్పారావు, పద్మనాభం మండల బిజెపి నాయకులు సిరపరపు వెంకటరావు , మత్స సోమేశ్వరరావు, కలగర్ల పేర్రాజు, ఎం గౌరెడ్డి , చప్ప కృష్ణ , కంటుబోతు సత్యవతి , కడితి ఈశ్వర రావు, పాలూరి కృష్ణారావు, కొవ్వాడ 41వ బూత్ బిజెపి మన్ కి బాత్ ప్రముఖ్ నాలి బాలాజీ, అధిక సంఖ్యలో స్థానికులు , పేద మహిళలు పాల్గొన్నారు .

శ్రీ నూకాంభిక అమ్మవారి సేవలో కార్పొరేటర్ ముమ్మన

విశాలాంధ్ర-పెందుర్తి : కొత్త అమావాస్య శ్రీ నూకాంభిక అమ్మవారి పండగ పురస్కరించుకొని జీవీఎంసీ 95వ వార్డు వరలక్ష్మినగర్ నందు కొలువైయున్న శ్రీ నూకాంభిక అమ్మవారిని స్థానిక కార్పొరేటర్, బిజెపి నేత మమ్మనదేముడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు,కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,నాయకులు గంట్ల నర్సింహా మూర్తి,అప్పికొండ రాంబాబు,కొప్పల రామ ప్రభాకరరావు, కంచిబోయిన వెంకట సంతోష్,అధిక సంఖ్యలో భక్తులు,పాల్గొన్నారు.

మినీ వ్యాన్ డ్రైవర్లకు యజమానులకు మధ్య జరిగిన చర్చలు తాత్కాలిక వాయిదా

విశాలాంధ్ర -పద్మనాభం: పద్మనాభంలో సిఐటియు ఆధ్వర్యంలో మినీ వ్యాన్ డ్రైవర్లకు మినీ వ్యాన్ యాజమాన్లకు జీతాలు ఇతర డిమాండ్లపై జరిగిన చర్చలలో తాత్కాలిక వాయిదా! డిమాండ్లు నెరవేర్చడానికి 15 రోజులు గడువు కావాలని మినీ వ్యాన్ యజమానులు మాట్లాడుతూ కొంతమంది యజమానులు క్యాంప్ వెళ్ళారని వారు వచ్చిన తర్వాత 15 రోజుల్లో మళ్లీ చర్చించి మీ డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు! దీనికి మినీ వ్యాన్ డ్రైవర్ సంఘం ప్రతినిధుల తరఫున సిఐటియు నాయకులు ఆర్ ఎస్ ఎన్ మూర్తి,ఎస్ అప్పలనాయుడు,ఆర్ సురేష్ని, నాగరాజు, ఎస్ పరమేష్ పాల్గొన్నారు.

రీసర్వే పై సమీక్ష సమావేశం

విశాలాంధ్ర - పద్మనాభం : రైతులకు ఎంతో ఉపయోగకరమైన రీసర్వేపై శనివారం తాసిల్దార్ కార్యాల యం వద్ద రెవెన్యూ, సర్వే సిబ్బందికి స సమీక్ష సమావేశాన్ని స్థానిక తాసిల్దార్ కి ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సర్వే మరియు రెవెన్యూ శాఖలవారు బాధ్యతయుతమై ఒకరికి ఒకరు సహకరించుకుంటూ రైతులతో సమన్వయం పరుచుకుంటూ ఎంతో సావధానంగా రైతులు దగ్గర ఉన్న పత్రాలను వారి చెప్పిన వివరాలను తెలుసుకొని అనంతరం ఆ రైతులకు ముందుగా ఏ రోజు మనం ఆ రైతు భూమిని సర్వే చేస్తున్నామో తెలియపరిచి, రీ సర్వే చేసిన రోజున భూ యజమాని రికార్డుల్లో ఉన్న భూమి భూ యజమాని చూపించిన భూమి కి సరిపోయినట్లయితే మనం ఆ రైతుకు న్యాయం చేసినట్లేనని ఆయన అన్నారు. ప్రతి బృందం కూడా బృందంలో ఒకరికొకరు సమన్వయం పరుచుకుంటూ ఒకరి సహకారంతో మరొకరు రీ సర్వే కచ్చితత్వంతో సమయపాలనతో పూర్తి చేయాలని అన్నారు.మన మండలంలోని రీ సర్వే మన జిల్లాకే కాక మన రాష్ట్రానికి ఆదర్శవంతంగా నిలవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.